క్లుప్తంగా

అనంతపద్మనాభస్వామి ఆలయంలో పూజలు



నవాబుపేట: మండలంలోని పోమాల్‌లో గుజరాత్‌కు చెందిన సుధీర్ పాండ్య నిర్మించిన అనంతపద్మనాభస్వామి ఆలయంలో శనివారం ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు పూజా కార్యక్రమాలు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాల్లో కృష్ణ, సురేందర్, కుమార్, రమేష్, వెంకటేష్, శ్రీహరి, నరేష్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మహబూబ్‌నగర్ రూరల్: విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే చట్టాలపై అవగాహన అవసరమని అదనపు జూనియర్ సివిల్ జడ్జి భావన అన్నారు. శనివారం మండలంలోని రామచంద్రాపూర్ గ్రామ జెడ్పీహెచ్‌ఎస్‌లో చట్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా, వేధింపులకు గురైనా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం జడ్జి భావనను గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, న్యాయవాది రవికుమార్‌యాదవ్, గ్రామపెద్దలు ఆనంద్ బిన్ని, శ్రీనివాసులు, వెంకట్రాములు, మహేష్‌గౌడ్, వీరన్న, వెంకటయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ అందజేత



మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని మాచన్‌పల్లిలో గల ప్రాథమికోన్నత పాఠశాలకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి కొన్నూరు ఆంజనేయరెడ్డి రూ.30 వేల విలువ గల ఆర్‌ఓ ప్లాంట్‌ను అందజేశారు. ప్రస్తుతం నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలోని పెద్దాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఆయన ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఈ సందర్భంగా ఆంజనేయరెడ్డిని కోటకదిర సింగిల్‌విండో చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మల్లికార్జున్‌రెడ్డి, మల్లు వెంకటేశ్వర్‌రెడ్డి శాలువాతో సన్మానించారు.

దుమ్ము, ధూళి సమస్యను పరిష్కరించాలని వినతి

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో వాకింగ్ ట్రాక్‌పై దుమ్ము, ధూళి సమస్యను పరిష్కరించాలని వాకర్లు విజయ్‌కుమార్, నరేందర్, మురళీ, శ్రీనివాస్, లక్ష్మణ్, సురేష్, మల్లేష్, నాగేష్, కిషోర్, తిరుపతి, బుచ్చన్న శనివారం జిల్లా యువజన, క్రీడల కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో దాదాపు 500మందికి పైగా అన్ని వయస్సుల వారు వస్తుంటారని, దుమ్ము, దూళితో వల్ల శ్వాస సంబంధిత సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ట్రాక్‌పై వారంలో రెండు సార్లు నీళ్లు చల్లాలని, మట్టిని ధృడంగా చేయడంతోపాటు అవసరమైన మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరారు.

విద్యార్థులకు అవగాహన



నవాబుపేట: 'కలాం స్ఫూర్తి యాత్ర'తో విద్యార్థులకు అధునాతన టెక్నాలజీని పరిచయం చేయటంతోపాటు వారికి వివిధ విభాగాల్లో అవగాహన కల్పించేలా కార్యక్రమం చేపడుతున్నట్లు నిర్వాహకుడు మధులాష్‌బాబు తెలిపారు. శనివారం స్థానిక జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు నూతన టెక్నాలజీపై అవగాహన కల్పించారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వాహనంలో అంతరిక్ష చిత్రాలు, నాస ఉపగ్రహ చిత్రాలు తదితర వాటిని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగ్యానాయక్, సీఆర్‌పీ జానార్ధన్, శ్రీధర్ పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన అన్నాసాగర్

భూత్పూర్: మండలంలోని అన్నాసాగర్‌లోని శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో శివస్వాముల మహాపూజతో శివనామస్మరణతో మార్మోగింది. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పడిపూజలో పాల్గొని శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. శివస్వాముల పాటలు భక్తులను గ్రామస్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.



మహబూబ్‌నగర్‌లో తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు..



మహమ్మదాబాద్ మండలంలోని మంగంపేట్‌తండా..



పీయూలో సంత్ సేవాలాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ శ్రీనివాస్ తదితరులు

గిరిజనుల ఆరాధ్యుడు సేవాలాల్

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి
- సంత్ సేవాలాల్ చిత్రపటాలకు ఘన నివాళి
- పలు చోట్ల గిరిజనుల ర్యాలీలు
- ఆకట్టుకున్న మహాభోగ్ బండార్ కార్యక్రమాలు
- సంప్రదాయ దుస్తుల్లో నృత్యాలు



నవాబుపేట మండల కేంద్రంలో సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

సాక్షి నెట్‌వర్క్: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ అని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. శనివారం నవాబ్‌పేటలో సేవాలాల్ ఉత్సవ సమితి అధ్యక్షుడు నిల్యానాయక్ అధ్యక్షతన జరిగిన సేవాలాల్ మహాభోగ్ బండార్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. గిరిజన తండాల అభివృద్ధికి తాను కృషిచేస్తానని అన్నారు. సేవాలాల్ ఆలయం కోసం తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సేవాలాల్, భవాని మాతకు పూజలు చేసి బోగ్ బండార్ సమర్పించారు. గిరిజనులు నిర్వహించిన ర్యాలీ, ఆటపాటలు ఆకట్టుకున్నాయి. మార్కెట్ చైర్మన్ లింగం, వైస్ చైర్మన్ తులసిరాంనాయక్, నీల్యానాయక్, సంతోష్‌నాయక్, గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

- మహబూబ్‌నగర్‌లో తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం కార్యాలయంలో సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నారాయణనాయక్ పాల్గొన్నారు.
- మహబూబ్‌నగర్‌లోని క్లాక్‌టవర్‌లో నిర్వహించిన సేవాలాల్ జయంతి వేడుకల్లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో తండాల్లో పెద్దఎత్తున అభివృద్ధి జరిగిందన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కేసీ నర్సిములు, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు శివరాజ్, నాయకులు మనోహర్‌నాయక్, రామ్‌లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి, నవకాంత్, గణేష్, కిషన్, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.
- మహబూబ్‌నగర్‌లోని పీయూలో సంత్ సేవాలాల్ జయంతిని పరిపాలన భవనంలో నిర్వహించారు. వీసీ జి.ఎన్.శ్రీనివాస్ మాట్లాడారు. హిందూ ధర్మ గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన గొప్ప వ్యక్తి సంత్ సేవాలాల్ అని కొనియాడారు. పరీక్షల నియంత్రణాధికారి డా.రాజ్‌కుమార్, ఎస్ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డా.ప్రవీణ, ప్రిన్సిపాళ్లు డా.కరుణాకర్‌రెడ్డి, డా.రవికాంత్, ఏఆర్ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ రవీందర్ పాల్గొన్నారు.
- కోయిల్‌కొండలో నిర్వహించిన సేవాలాల్ శోభాయాత్రలో నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి పాల్గొని సేవాలాల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బంజారా మహిళలు, యువతులతో కలిసి సాంప్రదాయ నృత్యాలు చేశారు. రవీందర్, విద్యాసాగర్‌గౌడ్, రవినాయక్ ఉన్నారు.
- మహమ్మదాబాద్ మండలంలోని మంగంపేట్ తండా, షేక్‌పల్లి తండా, అన్నారెడ్డిపల్లితండాలతో పాటు అన్ని తండాల్లో సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు, మహిళలు పెద్దఎత్తున చౌడాపూర్ మండలం మక్తవెంకటాపూర్‌లో చేపట్టిన సేవాలాల్ జయంతికి తరలివెళ్లారు. మాజీ ఎంపీపీ శాంతీబాయి, మాజీ సర్పంచ్ గీతాపాండు పాల్గొన్నారు.
- మిడ్జిల్‌లో బస్టాండ్ నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు గిరిజనులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బోగ్ బండార్ నిర్వహించారు. శ్రీనునాయక్, సీతారామ్, లక్ష్మన్, తిరుపతి పాల్గొన్నారు.
- చిన్నచింతకుంట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎల్లయ్య సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.
- జడ్చర్లలో సంత్ సేవాలాల్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సిగ్నల్‌గడ్డ నుంచి శంకరాయపల్లితండా సమీపంలో ఉన్న బొంగరాలగుట్ట వద్దకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహాబోగ్ బండారో కార్యక్రమాన్ని వైభవంగా చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, గిరిజన నాయకులు గోపాల్ నాయక్, గోవింద్‌నాయక్ పాల్గొన్నారు.
- రాజాపూర్‌లో సేవాలాల్ జయంతినిని గిరిజన తండాల నాయకులు ఘనంగా నిర్వహించారు. రంగారెడ్డిగూడనుంచి భారీ ర్యాలీ నిర్వహించగా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పాల్గొన్నారు. శ్రీనివాస్‌నాయక్, రమేష్‌నాయక్, వెంకట్‌నాయక్,నరహరి, విక్రంరెడ్డి,గోవర్ధన్‌రెడ్డి, నసీర్‌బేగ్, శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.



కోయిల్‌కొండలో శోభాయాత్రలో పాల్గొన్న నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి



జడ్చర్ల సమీపంలో బొంగరాలగుట్ట వద్ద ..

గిరిజనులకు అండ..

- ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి



కొత్తూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్: గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తూర్ సమీపంలో సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రెండు రోజుల క్రితం ప్రభుత్వ ఉద్యోగులైన గిరిజనులకు సెలవు ప్రకటించారని, రాబోయే రోజుల్లో సేవాలాల్ జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించేందుకు సీఎం దృష్టికి తీసుకెళ్తానని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా నాయకుడు గోవింద్‌నాయక్ రూ. లక్ష దేవాలయం నిర్మాణానికి ఇవ్వడానికి ముందుకు వచ్చినందుకు ఎమ్మెల్యే అభినందించారు. మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్, ఎంపీడీఓ ప్రభాకర్, ఏఓ మురళీధర్, డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకట్ నర్సింహారెడ్డి, కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, లిక్కి నవీన్‌గౌడ్, భూపతిరెడ్డి, రఘుపతిరెడ్డి, రాంరెడ్డి, గోవింద్‌నాయక్, హర్యానాయక్, రామునాయక్, మాన్యానాయక్, రెడ్యానాయక్, భీక్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పని చేయాలి

- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

అడ్డాకుల: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండలం జానంపేటలో శనివారం సాయంత్రం ఆ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ అభ్యర్థులందరినీ గెలిపించుకునేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. పదేళ్లల్లో గ్రామాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ పార్టీ చేసిన కృషిని ఓటర్లకు చేరవేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్‌ఎస్‌కు మద్దతు కూడగట్టాలని సూచించారు. తాళ్లగడ్డకి చెందిన కొందరు యువకులు బీఆర్‌ఎస్ పార్టీ చేరారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జి.ఇంద్రయ్యసాగర్, లక్ష్మీనర్సింహా, వెంకటేశ్వర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, కొండయ్య, చంద్రశేఖర్, రవీందర్‌గౌడ్, సత్తార్ ఉన్నారు.

'న్యూరిషి'లో రక్తదాన శిబిరం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పుల్వామాలో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ సైనికులకు సంఘీభావంగా శనివారం స్థానిక రాజేంద్రనగర్‌లోని న్యూరిషి హైస్కూల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ రక్తదానంతో అనేక ప్రాణాలను రక్షించవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ చంద్రకళా వెంకటయ్య, డైరెక్టర్లు పూజిత మోహన్‌రెడ్డి, శిరీష ప్రవీణ్‌కుమార్, సాయిసుశాంత్ కృష్ణ, లయన్స్ క్లబ్ చైర్మన్ నటరాజ్, సభ్యులు బాబుల్‌రెడ్డి, యెన్నం లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

తూము తెరడంతో నీటమునిగిన పంటలు

- తహసీల్దార్‌కు ఆయకట్టు రైతుల ఫిర్యాదు



తహసీల్దార్ బ్రహ్మంగౌడ్‌కు ఫిర్యాదు చేస్తున్న ఆయకట్టు రైతులు

జడ్చర్ల: చేపలు పట్టుకునేందుకు చెరువులోని నీళ్లను తూము తెరిచి బయటకు వదలడంతో పంటలు నీట మునిగి నష్టం జరిగిందంటూ ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. శనివారం తహసీల్దార్ బ్రహ్మంగౌడ్‌కు వారు ఫిర్యాదు చేశారు. మండలంలోని నసరుల్లాబాద్ నోటిఫైడ్ పెద్ద చెరువు కింద నరుల్లాబాద్‌తో పాటు తంగెళ్లపల్లి, చర్లపల్లి గ్రామాల పరిధిలోని ఆయకట్టు ఉంది. చెరువు కింద వరి, తదితర పంటలు సాగు చేశారు. చేపల వేలం కాంట్రాక్టర్ వెంకటేశ్, అతని అనుచరులు బాలస్వామి, రాఘవేందర్ చెరువులో నీళ్లను ఖాళీచేసి చేపలను పట్టుకోవాలని భావించి రాత్రికి రాత్రి తూము గేట్లను కిందకు వదిలారు. దీంతో చెరువులో తెల్లారేసరికి దాదాపు 3అడుగులకు పైగా నీళ్లు ఖాళీ అయ్యాయి.ఆయకట్టంతా చెరువు నీళ్లతో మునిగిపోయి పంటలకు తీరని నష్టం వాటిల్లింది. తూము గేట్లను బంద్ చేసిన రైతులు తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చి ఆందోళన చేపట్టారు. చెరువు నీటిని వదలి తమ పంటలకు నష్టం కలిగించినవారిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బాధిత రైతులు మాసయ్య, మల్లయ్య, మల్లేష్, వెంకట్‌రాములు, శ్రీశైలం, పరశురాం, వెంకటయ్య, భీమయ్య, జంగయ్య పాల్గొన్నారు.

ప్రైవేట్‌స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం



జడ్చర్ల టౌన్: సాయినగర్ కాలనీలో శనివారం మధ్యాహ్నం ఓ ప్రైవేట్‌స్కూల్ బస్సుకు పెనుప్రమాదం తప్పింది. విద్యార్థులను తీసుకెళ్తున్న డ్రైవర్ రోడ్డు మలుపులో వేగంగా మళ్లేందుకు ప్రయత్నించగా అదుపుతప్పడంతో ముందు టైరు కాల్వలోకి దూసుకుపోయింది. బస్సు ఒక్కసారిగా కుదుపులకు గురికావటంతో విద్యార్థులు ముందుకు తూలిపడి గగ్గోలుపెట్టారు. భయభ్రాంతులకు గురై అరుపులు, కేకలు పెట్టారు. ఘటనలో విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. బస్సు అదుపుతప్పిన ప్రమాదం విషయం తెలియగానే విద్యార్థుల తల్లిదండ్రులు అక్కడికి చేరుకుని డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని విద్యార్థులను తల్లిదండ్రులను శాంతింపజేశారు. పాఠశాల యాజమాన్యం వస్తేనే బస్సును బయటకు తీయాలని విద్యార్థుల తల్లిదండ్రులు పట్టుబట్టారు. చివరకు జేసీబీ సహాయంతో బస్సును బయటకు లాగారు. రెగ్యులర్‌గా వచ్చే బస్సుడ్రైవర్ రాకపోవటంతో మల్లేష్ అనే తాత్కాలిక డ్రైవర్‌ను పంపించారు.

ధర్మభిక్షంకు ఘన నివాళి



మహబూబ్‌నగర్ న్యూటౌన్: స్వాతంత్ర సమరయోధుడు, మాజీ ఎంపీ కామ్రేడ్ ధర్మభిక్షం జయంతి వేడుకలను సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం సీపీఐ కార్యాలయంలో ధర్మభిక్షం చిత్రపటానికి ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రాము, చాంద్‌బాషా, బసవరాజ్, మహేశ్ పాల్గొన్నారు.

టీజీఓల ఐక్యత విచ్ఛిన్నం కారాదు



టీజీఓ డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ విజయేందిర, టీజీఓ నాయకులు

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- అభివృద్ధికి ప్రతి ఒక్క టీజీఓ సహకరించాలి: కలెక్టర్ విజయేందిర
- క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): టీజీఓల ఐక్యత విచ్ఛిన్నం కారాదని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్(టీజీఓ) అసోసియేషన్ క్యాలెండర్, డైరీని కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్లు స్వేచ్ఛగా మాట్లాడుకోవడానికి కూడా వీల్లేకుండా ఉండేదన్నారు. నాడు ఉద్యోగుల కోసం పోరాటం చేసే నాయకులపైన కేసులు నమోదు చేశారన్నారు. ఇప్పుడు ఉన్నది ప్రజాపాలన అని ఆయన స్పష్టంచేశారు మీ సమస్యలను ప్రభుత్వం త్వరలో తప్పకుండా పరిష్కరిస్తుందని హామీఇచ్చారు. కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ అధికారులు విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధికి ప్రతి ఒక్క టీజీఓ సహకరించాలన్నారు. ఐక్యంగా ఉండి టీజీఓ సంఘాన్ని ముందుకు తీసుకుపోవాలన్నారు. అంతకుముందు సేవాలాల్ మహా రాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, టీజీఓ రాష్ట్రఅధ్యక్షుడు శ్రీనివాస్ రావు, ప్రధానకార్యదర్శి సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు శ్యాం, రాష్ట్రఉపాధ్యక్షుడు మాచర్ల రామకృష్ణగౌడ్, జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి వరప్రసాద్, ఉపాధ్యక్షులు శ్రీనుగౌడ్, యాదగిరి, టైటస్‌పాల్, రవీందర్, చంద్రకళ, రవీందర్, తానాజీ, జగన్‌మోహన్‌రెడ్డి, గంగాధర్, నరేష్, సతీష్, జగదీశ్, బాలకిషన్ పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

- జడ్చర్ల జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ ముదస్సర్



మాట్లాడుతున్న జడ్చర్ల జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ ముదస్సర్

భూత్పూర్: చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జడ్చర్ల జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ ముదస్సర్ అన్నారు. శనివారం భూత్పూర్ సమీపంలోని రాజీవ్ స్వగృహలో ఉన్న మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాల 8వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. విద్యార్థినులు ఉన్నతమైన విద్యనభ్యసించి తమ కాళ్లపై తాము నిలబడి తమ తల్లిదండ్రులకు, పాఠశాలకు, ఉపాధ్యాయులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. మైనర్లు వివాహం చేసుకుంటే చట్టరీత్యా నేరం, వివాహం చెల్లదని జడ్జి వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు జడ్జి మహ్మద్ ముదస్సర్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుగుణశ్రీ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు ఉన్నారు.

'వృక్షార్చన' విజయవంతం చేద్దాం



మొక్కను నాటిన మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత

జడ్చర్ల టౌన్: ఈనెల 17న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ జన్మదినం పురస్కరించుకొని నిర్వహిస్తున్న వృక్షార్చన కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని మున్సిపల్‌చైర్ పర్సన్ కోనేటి పుష్పలత పిలుపునిచ్చారు. శనివారం మున్సిపాలిటీ ఆవరణలో ఆమె మొక్కనాటి నీళ్లు పోశారు. ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలని ఆమె కోరారు. కేసీఆర్‌కు అందించే కానుక అదేనన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు దీక్షలు



ఉదండాపూర్ రిజర్వాయర్ కట్టపై ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

జడ్చర్ల: సమస్యలు పరిష్కరించి తమకు న్యాయం చేసేంత వరకు రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తామని ఉండాపూర్ నిర్వాసితులు పేర్కొన్నారు. మండలంలోని ఉదండాపూర్, కిష్టారం గ్రామాల సమీపంలో రిజర్వాయర్‌కట్టపై చేపట్టిన దీక్షలు శనివారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు నిర్వాసితులు మాట్లాడారు. తక్కువ ధరలకు భూములను ప్రాజెక్ట్ కోసం అప్పగించామని, మొదటినుండి తమకు సరైన పరిహారం సకాలంలో ఇవ్వకపోవడంతో తీవ్రంగా నష్టపోయామన్నారు. తమకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ రూ.25లక్షలకు పెంచి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పునరావాస కేంద్రంలో మౌలిక సౌకర్యాలు పూర్తిచేసి తమను అక్కడకు తరలించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మాజీ సర్పంచ్‌లు వెంకటయ్య, శంకరయ్యగౌడ్, హన్మంతు, శ్రీను, మాసయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

బొటానికల్ గార్డెన్‌లో 'రామిరెడ్డిగూడెం' విద్యార్థినులు



జడ్చర్ల టౌన్: పట్టణంలోని డా.బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌ను శనివారం రామిరెడ్డిగూడెం తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలకు చెందిన 105మంది విద్యార్థులు సందర్శించారు. గార్డెన్‌కు చేరుకున్న వారికి ప్రిన్సిపాల్ డా.సుకన్య స్వాగతం పలికారు. గార్డెన్ సమన్వయకర్త డా.సదాశివయ్య వారికి గార్డెన్ విశేషాలను వివరిస్తూ చూయించారు. గార్డెన్‌కు అనుబంధంగా ఉన్న జీవ వైవిధ్య పరిశోధన విద్యాకేంద్రంను సందర్శించారు. అక్కడ భద్రపర్చిన అతిపెద్ద జెర్రిపోతు కుబుసాన్ని వారు చూసి ఆశ్చర్యపోయారు. ఇటీవల పట్టుకు వచ్చిన పాములను చూసి ఆనందపడ్డారు. గార్డెన్ సందర్శనతో తమకు అనేక రకాలైన అంతరించిపోతున్న మొక్కలు, ఔషధమొక్కల గురించి తెలియటంతో పాటు పుస్తకాల్లో చదువుకున్న మొక్కలను చూడగలిగామని విద్యార్థులు తెలిపారు. ఉపాధ్యాయులు లలిత, సింధూజ, శైలజ, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు రవీందర్, సాయిరాం, శివసాయిలు ఉన్నారు.

విద్యార్థినుల ఎంపికపై హర్షం

చిన్నచింతకుంట : మండలంలోని అల్లీపురం గ్రామానికి చెందిన విద్యార్థినులు నందిని, అలేఖ్యలు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక అయ్యారు. శనివారం వనపర్తి జిల్లాలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీల్లో పాల్గొని మొదటి స్థానంలో నిలిచారు. ఈనెల 18, 19 తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ మైదానంలో జరిగే 11వ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్ పోటీలకు ఎంపిక కాగా వారిని గ్రామస్తులు అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

ఎస్‌ఐగా రామ్‌లాల్‌నాయక్ బాధ్యతల స్వీకరణ



రామ్‌లాల్‌నాయక్

చిన్నచింతకుంట: మండల ఎస్‌ఐగా రామ్‌లాల్‌నాయక్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఆర్.శేఖర్ బదిలీపై నారాయణపేట జి ల్లాలో వీఆర్‌కు వెళ్లారు. నారాయణపేట జిల్లాలో వీఆర్‌గా విధులు నిర్వహిస్తున్న రామ్‌లాల్‌నాయక్ చిన్నచింతకుంట ఎస్‌ఐగా బదిలీపై వచ్చారు.

సర్వేలో పాల్గొనని వారు వివరాలు సమర్పించండి

జడ్చర్ల టౌన్: కులగణన సర్వేలో పాల్గొనని వారు సంబంధిత వివరాలతో ఆదివారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ కార్యాలయంలో ఉన్న ప్రజాపాలన సేవాకేంద్రంలో వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు.